సాక్షి
విశాఖపట్నం
సోమవారం । 6 । అక్టోబర్ । 2025



మాట్లాడుతున్న శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ. చిత్రంలో ఉత్తరాంధ్ర రీజినల్ కో ఆర్డినేటర్ కురసాల కన్నబాబు, ఎంపీ తనూజరాణి, మాజీ మంత్రులు తమ్మినేని సీతారాం, ధర్మాన ప్రసాదరావు, అమర్‌నాథ్, కృష్ణదాస్, పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు

ప్రభుత్వ మెడికల్ కాలేజీలను పెట్టి వైద్య విద్యను మరింత మందికి అందుబాటులోకి తేవాలన్న సత్సంకల్పానికి కూటమి నేతలు తూట్లు పొడిచారు. ఆంధ్రుల హక్కు విశాఖ ఉక్కుపై ప్రై'వేటు' వేస్తున్నారు. బల్క్‌డ్రగ్ పార్కుతో మత్స్యకారుల నుంచి ఆంధ్ర–ఒడిశా సరిహద్దులోని గిరిజనుల వరకు అనేక విషయాల్లో అన్యాయం చేస్తున్నారు. సాగునీటి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేస్తూ ఉత్తరాంధ్ర రైతులకు తీరని ద్రోహం తలపెట్టారు. ఇలా వివిధ వర్గాల ప్రజల బతుకులను దుర్భరం చేస్తున్న కూటమి ప్రభుత్వ పాలనపై వైఎస్సార్‌సీపీ సమరభేరి మోగించింది. ఆదివారం జరిగిన ఉత్తరాంధ్ర స్థాయి విస్తృత సమావేశంలో ఏడు అంశాలపై తీర్మానాలు చేసింది.



ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై 7 తీర్మానాలు

సభాధ్యక్షత వహించిన కురసాల కన్నబాబు పార్టీ నేతల నుంచి ముఖ్యమైన సూచనలు, సలహాలు తీసుకున్నారు. అనంతరం ఉత్తరాంధ్ర ప్రాంతంలోని 7 ప్రజా వ్యతిరేక విధానాలపై వైఎస్సార్ సీపీ తీర్మానాలు చేసింది.

సమావేశంలో ఉత్తరాంధ్ర రీజినల్ కో ఆర్డినేటర్ కురసాల కన్నబాబు, శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ, ఎంపీలు గొల్ల బాబూరావు, తనూజరాణి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు, మాజీ స్పీకర్ తమ్మినేని, మాజీ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, కృష్ణదాస్, బూడి ముత్యాలనాయుడు, అమర్‌నాథ్, పుష్పశ్రీవాణి, రాజన్న దొర, పార్టీ జిల్లాల అధ్యక్షులు కేకే రాజు, మజ్జి శ్రీనివాసరావు, పరీక్షిత్ రాజు, పార్లమెంట్ పరిశీలకుడు కదిరి బాబూరావు, మాజీ ఎంపీ బెల్లాన, మాజీ ఎమ్మెల్యేలు ధర్మశ్రీ, కోలగట్ల

ఉత్తరాంధ్ర సమస్యలపై సమరభేరి



వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ కన్నబాబు, శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ, ఎంపీలు గొల్ల బాబూరావు, తనూజారాణి, ఎమ్మెల్సీలు కల్యాణి, రవిబాబు, మాజీ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, కృష్ణదాస్, బూడి ముత్యాలనాయుడు, అమర్‌నాథ్, జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, పరిశీలకుడు బాబూరావు

- కూటమి సర్కారు వైఫల్యాలపై ఉద్యమించనున్న వైఎస్సార్‌సీపీ
- ఉత్తరాంధ్ర విస్తృత స్థాయి సమావేశంలో పార్టీ నేతల తీర్మానం
- ఏడు అంశాలపై ప్రజలకు న్యాయం జరిగే వరకు రాజీలేని పోరాటం
- 9న నర్సీపట్నం మెడికల్ కాలేజీని సందర్శించనున్న వైఎస్ జగన్
- విశాఖ ఎయిర్‌పోర్టు నుంచి రోడ్డు మార్గంలో భీమబోయినపాలెం చేరుకోనున్న మాజీ సీఎం

సాక్షి, విశాఖపట్నం: దిక్కులేని ప్రజల గొంతుకై.. వారి తరఫున పోరాటానికి సిద్ధమై.. వాయిస్ ఫర్ ది వాయిస్‌లెస్‌గా నిలుస్తూ.. సమస్యల పరిష్కారమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ కూటమి సర్కారుకు అల్టిమేటం ఇచ్చింది. ప్రభుత్వం తప్పులు, వైఫల్యాలను ఇకపై ఉపేక్షించేది లేదని హెచ్చరించింది. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర సమరశంఖం పూరించాలని నిర్ణయించినట్టు పార్టీ ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు, శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ ప్రకటించారు. ఆదివారం ఆనందపురంలోని పెద్దిపాలెంలోని చెన్నాస్ కన్వెన్షన్ హాల్లో ఉత్తరాంధ్ర జిల్లాల వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. తొలుత మహానేత వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించి సమావేశం ప్రారంభించారు. ఈ సమావేశంలో కురసాల కన్నబాబు మాట్లాడుతూ.. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మంచి పేరొస్తుందనే భయంతో ఆయన అమలు చేసిన సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. పేదలకు ఉచిత వైద్యం అందించడమే లక్ష్యంగా 17 మెడికల్ కాలేజీలు మొదలుపెట్టి 7 కాలేజీలను పూర్తి చేశారని, వాటిని కూడా ప్రైవేటీకరణ పేరుతో చంద్రబాబు తన వారి చేతుల్లో పెట్టే ప్రయత్నం చేయడం దుర్మార్గమని పేర్కొన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాజీలేని పోరాటం చేయాలని వైఎస్సార్ సీపీ నిర్ణయించిందన్నారు. ఉత్తరాంధ్ర నుంచే సమరశంఖం పూరించేందుకు ఈ నెల 9న నర్సీపట్నం మెడికల్ కాలేజీని వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సందర్శించనున్నారని చెప్పారు. అక్కడే ప్రజలను ఉద్దేశించి మీడియాతో మాట్లాడతారని వివరించారు.

కార్యక్రమంలో మాజీ డిప్యూటీ సీఎంలు బూడి ముత్యాలనాయుడు, ధర్మాన కృష్ణదాస్, పుష్ప శ్రీవాణి, ఎమ్మెల్సీలు నర్తు రామారావు, సురేష్ బాబు, కుంభా రవిబాబు, పండుల రవీంద్రబాబు, ఎమ్మెల్యేలు రేగం మత్స్యలింగం, మత్స్యరాస విశ్వేశ్వరరాజు, జెడ్పీ చైర్‌పర్సన్లు జె.సుభద్ర, పిరియా విజయ, పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజు, పార్లమెంట్ సమన్వయకర్తలు బొడ్డేడ ప్రసాద్, బెల్లాన చంద్రశేఖర్, పార్లమెంట్ పరిశీలకులు కదిరి బాబూరావు, శోభా హైమావతి, సూర్యానారాయణ రాజు, మాజీ ఎంపీలు భీశెట్టి వెంకటసత్యవతి, గొడ్డేటి మాధవి, మాజీ ఎమ్మెల్యేలు కోలగట్ల వీరభద్ర స్వామి, కరణం ధర్మశ్రీ, పెట్ల ఉమాశంకర్ గణేష్, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, కన్నబాబు రాజు, తిప్పల నాగిరెడ్డి, గొర్లె కిరణ్‌కుమార్, తైనాల విజయ్‌కుమార్, చింతలపూడి వెంకట్రామయ్య, తిప్పల గురుమూర్తిరెడ్డి, చెట్టి ఫాల్గుణ, పిరియా సాయిరాజు, విశ్వసరాయి కళావతి, కె.భాగ్యలక్ష్మి, చెంగల వెంకట్రావ్, సమన్వయకర్తలు మొల్లి అప్పారావు, మలసాల భరత్‌కుమార్, పేరాడ తిలక్, చింతాడ రవి కుమార్, రాష్ట్ర కార్యదర్శులు లక్ష్మణరావు, కరిమి రాజేశ్వరరావు, సాడి శాంప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు చింతకాయల సన్యాసిపాత్రుడు, చిక్కాల రామారావు, పైల శ్రీనివాసరావు, ఉత్తరాంధ్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ ఈర్లె అనురాధ, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు జాన్ వెస్లీ, సీఈసీ సభ్యులు కోలా గురువులు, కాయల వెంకటరెడ్డి, ఎస్‌ఈసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా..



మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ.. పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలనే ఆశయంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ. 8 వేల కోట్లకు పైగా ఖర్చు చేసి 17 మెడికల్ కాలేజీల నిర్మాణం చేపట్టిందని, వాటిలో ఐదు ప్రారంభమయ్యాయని, మరో రెండు పూర్తయ్యాయని గుర్తుచేశారు. మిగిలిన వాటిని కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయడాన్ని వ్యతిరేకిస్తూ తొలి తీర్మానం ప్రవేశపెట్టగా.. పార్టీ నేతలంతా ఆమోదించారు.

స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా..



రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూ**రావు మాట్లాడుతూ..** 'విశాఖ స్టీల్ ప్లాంట్ **ప్రైవేటీ**కరణకు వ్యతిరేకంగా పార్లమెం**ట్‌లో** చాలా సార్లు ప్రశ్నించాను. స్టీల్‌ప్లాంట్‌కు **నిధులు** ఇచ్చామని కేంద్ర మంత్రులు చెబుతున్నా.. ప్రైవేటీకరణ చేయడానికి సిద్ధంగా ఉన్నట్లుగానే కేంద్రం వైఖరి ఉందన్నారు. ఎన్నికల ముందు స్టీల్ ప్లాంట్‌ను కాపాడతామని హామీ ఇచ్చిన చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఇప్పుడు మౌనంగా ఉన్నారు. స్టీల్‌ప్లాంట్ కాపాడుకునేందుకు మనమంతా ఏకతాటిపై వచ్చి పోరాడాలి' అని తీర్మానం ప్రవేశపెట్టారు. దీనికి విశాఖ పార్లమెంట్ సమన్వయకర్త బొత్స ఝాన్సీ, గాజువాక సమన్వయకర్త దేవన్‌రెడ్డి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా బొత్స ఝాన్సీ మాట్లాడుతూ విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు అనే నినాదంతో ఏర్పడిన స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తామంటే వైఎస్సార్ సీపీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. దేవన్‌రెడ్డి మాట్లాడుతూ.. 'ఒక వైపు విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో 34 విభాగాలను ప్రైవేటీకరిస్తున్నారు. మరో వైపు నుంచి వీఆర్‌ఎస్‌కు వెళ్లని ఉద్యోగులను బెదిరిస్తున్నారు. దీనిపై నియోజకవర్గ స్థాయిలో పోరాటం చేస్తున్నా ఫలితం లేకుండా పోతోంది. ఉత్తరాంధ్ర స్థాయిలో భారీగా పోరాటం చేయాల్సిన అవసరం ఉంది.' అని అభిప్రాయపడ్డారు.

గిరిజన సమస్యల పరిష్కారం కోసం..



ఆంధ్రా–ఒడిశా సరిహద్దులో గిరిజన సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర తీర్మానం చేశారు. కేంద్రం, ఒడిశా, ఆంధ్రలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉందని, సరిహద్దు గిరిజనుల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యపై పోరాడాలని తీర్మానించారు.

నక్కపల్లి బల్క్‌డ్రగ్ పార్కు భూసేకరణపై..



బల్క్‌డ్రగ్ పార్కు భూసేకరణను వ్యతిరేకిస్తూ రిలే నిరాహార దీక్షలు చేస్తున్న మత్స్యకారులకు న్యాయం చేయాలని కోరుతూ కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ తీర్మానం ప్రవేశ పెట్టారు. దీనిపై ఎంపీ గొల్ల బాబూరావు మాట్లాడుతూ ఈ రసాయనిక పరిశ్రమ వల్ల మత్స్యకారుల జీవనోపాధి దెబ్బతింటుందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మత్స్యకారులకు అన్యాయం చేయవద్దన్నారు.

ప్రభుత్వ భూముల కేటాయింపుపై..



లులూ వంటి సంస్థలకు కారుచౌకగా భూములు కట్టబెట్టడాన్ని వ్యతిరేకిస్తూ విజయనగరం జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'విశాఖ, విజయనగరం జిల్లాల్లో ఉన్న విలువైన భూములను కారుచౌకగా కార్పొరేట్ సంస్థలకు కూటమి ప్రభుత్వం కట్టబెడుతోంది. వైఎస్సార్ సీపీ హయాంలో ఉత్తరాంధ్ర ప్రాంతంలో అభివృద్ధి పనులకు, ట్రైబల్ ఇన్‌స్టిట్యూట్ కోసం భూసేకరణ చేపట్టాం. దానిపై చాలా దుష్ప్రచారం చేశారు. ఇప్పుడు లులూ వంటి అడ్రస్ లేని కార్పొరేట్ సంస్థలకు ఖరీదైన భూములను అప్పగిస్తున్నారు.' అని అన్నారు.

చిరు వ్యాపారుల తొలగింపునకు వ్యతిరేకంగా..



జీవీఎంసీ పరిధిలో 42 వేల మంది చిరు వ్యాపారుల షాపులను, ఫుడ్‌కోర్టులను తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు తీర్మానం ప్రవేశపెట్టారు. దీనికి మాజీ ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్‌కుమార్, మళ్ల విజయప్రసాద్ మద్దతు పలికారు. ఈ సందర్భంగా కేకే రాజు మాట్లాడుతూ..'కూటమి ప్రభుత్వం చిరువ్యాపారుల కుటుంబాలను రోడ్డున పడేసింది. హాకర్లకు ఏయూ స్థలంలో వ్యాపారాలు చేసుకునే అవకాశం కల్పిస్తామని మభ్యపెడుతున్నారు. దీన్ని వైఎస్సార్ సీపీ తీవ్రంగా ఖండిస్తోంది. వ్యాపారులకు న్యాయం జరిగేదాకా పోరాడుతాం.' అని అన్నారు. మాజీ ఎమ్మెల్యేలు వాసుపల్లి, మళ్ల మాట్లాడుతూ.. ' చిరు వ్యాపారుల దుకాణాలను కూల్చేసి కూటమి ప్రభుత్వం వారి పొట్టకొట్టింది. సుప్రీంకోర్టు ఆదేశాలున్నప్పటికీ క్రూరంగా వ్యవహరించారు. పార్టీ ఆదేశాల మేరకు ఉత్తరాంధ్ర సమస్యలపై పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నాం.' అని అన్నారు.

సాగునీటి ప్రాజెక్టులపై..



ఉత్తరాంధ్రలో పెండింగ్‌లో ఉన్న వంశధార, జంఝావతి, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, తోటపల్లి వంటి సాగునీటి, తాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ.. 'వంశధార రిజర్వాయర్ నుంచి ఉద్దానం ప్రాంతానికి మంచి నీటి సరఫరా ప్రాజెక్టుకు వైఎస్సార్ సీపీ ప్రారంభించింది. పలాస నియోజకవర్గంకు పూర్తి స్థాయిలో శుద్ధ జలం అందించాం. మిగిలిన పనులు పూర్తి చేయాలి. వైఎస్సార్ సీపీ హయాంలో మూలపేట పోర్టు పనులు 90 శాతం పూర్తయ్యాయి. 1995లో ప్రారంభమైన వంశధార ఇప్పటికీ పూర్తి కాలేదు. ఈ ప్రాజెక్టు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలి.' అని అన్నారు. ఈ తీర్మానానికి మద్దతుగా మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ.. సాగు నీరు అందకపోవడంతో అనకాపల్లి జిల్లాలో చెరకు, వరి సాగు తగ్గిపోయిందన్నారు. జిల్లాలోని ఐదు షుగర్ ఫ్యాక్టరీల్లో చోడవరం ఒకటే మిగిలిందని, దానికి కూడా కాపాడుకోలేదని పరిస్థితి నెలకొందన్నారు.

పార్టీ సంస్థాగత బలోపేతంపై దృష్టి

శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసుకుంటే, మనం చేసే ప్రతీ కార్యక్రమం ప్రజల్లోకి వెళుతుందన్నారు. పెండింగ్‌లో ఉన్న జిల్లా, మండల కమిటీలను, గ్రామ ఇన్‌చార్జిల నియామకాలను గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ.. 'స్వాతంత్ర్యం అనంతరం ఉత్తరాంధ్రకు మేలు చేసిన ముఖ్యమంత్రులు వైఎస్సార్, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే. మూలపేట పోర్టు, ప్రభుత్వ మెడికల్ కళాశాలలు వైఎస్సార్ సీపీ హయాంలోనే వచ్చాయి. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను, దొరికిన ప్రతీ అంశాన్ని మనం ప్రశ్నించాలి. స్థానిక అంశాలపై దృష్టి సారించాలి. యువ నాయకత్వం పార్టీ బలోపేతానికి కృషి చేసి, నాయకులుగా ఎదగాలి.'అని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే వరుదు కల్యాణి మాట్లాడుతూ స్థానిక కమిటీల్లో మహిళలకు సమన్వయకర్తలు ప్రాధాన్యమివ్వాలని కోరారు. స్థానిక సమస్యలపై విస్తృతంగా పోరాటం చేయాలని మహిళలకు పిలుపునిచ్చారు. అరకు ఎంపీ తనూజ రాణి మాట్లాడుతూ..ప్రతీ నియోజకవర్గంలో సమన్వయకర్త సమక్షంలో నియోజకవర్గ స్థాయి సమస్యలపై సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. వాటిని పరిష్కరించే వరకూ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేలా పోరాటం చేయాలని సూచించారు.

- ఉద్యోగ సంఘాల మధ్య చిచ్చు పెడుతున్న ప్రభుత్వం
- తెలుగు నాడు సంఘం పేరుతో ఉద్యమ కార్యాచరణ విచ్ఛిన్నం
- ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం అన్ని సంఘాలు నిరసనలు
- 'తెలుగునాడు' సంఘం మాత్రం తాము పాల్గొనడం లేదంటూ ప్రకటన
- జేఏసీ ఉద్యమ కార్యాచరణకు మోకాలడ్డేందుకు ప్రభుత్వం కుట్ర

విద్యుత్ ఉద్యమంపై కూటమి కుట్ర

సాక్షి, విశాఖపట్నం: విద్యుత్ కాంట్రాక్ట్, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ప్రధాన డిమాండ్లతో దశలవారీగా సమ్మె నిర్వహిస్తున్న జేఏసీ కార్యచరణ పై కూటమి ప్రభుత్వం కుట్ర పన్నుతోంది. విద్యుత్ ఉద్యోగులు కార్మికుల సంఘాల మధ్య చిచ్చుపెట్టేలా తమ అనుబంధ అసోసియేషన్ తెలుగునాడు ని పావుగా వినియోగించుకుంటోంది. గత నెల చివరివారం నుంచి ఆందోళనలు నిర్వహిస్తున్న చీమకుట్టినట్లైనా స్పందించని ప్రభుత్వం ఇప్పుడు జేఏసీ ఉద్యమాన్ని అణిచివేసేందుకు అడ్డగోలు చర్యలకు సిద్ధమవుతోంది. మరోవైపు ప్రభుత్వం ఎన్ని కుట్రలు పన్నినా అక్టోబర్ 15 నుంచి తమ ఆందోళన తీవ్రతరం చేస్తామని జేఏసీ హెచ్చరించింది.



విద్యుత్ రంగములో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల, ఉద్యోగుల దీర్ఘకాలిక డిమాండ్స్ ను పరిష్కరించుకుంటే అక్టోబర్ 15 వ తేదీ తర్వాత నిరవధిక సమ్మెకు వెళ్తామని ఏపీ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జేఏసీ మరోసారి ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేసింది. సోమవారం ఏపీ ఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించేందుకు అన్ని ఉద్యోగ సంఘాలు సమాయత్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో విద్యుత్ ఉద్యోగ సంఘాల మధ్య చిచ్చుపెట్టి ఉద్యమాన్ని అణిచివేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలు పొందుతుంది. టీడీపీ అనుబంధ సంస్థ తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం ని అడ్డం పెట్టుకొని ఉద్యోగులకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని పక్కదారి పట్టించేందుకు ఎత్తుగడలు వేస్తోంది. డిస్కాంట్ లో పనిచేస్తున్న దాదాపు అందరూ ఉద్యోగులు కార్మికుల సంక్షేమం కోసం వారి అభివృద్ధి కోసం జేఏసీ ఉద్యమ కార్యచరణ చేపడుతుంటే తాము మాత్రం ఉద్యోగులకు వ్యతిరేకంగా ఉంటామంటూ ఉద్యమంలో పాల్గొంటూ తెలుగు నాడు సంఘం ప్రకటన చేయడం వెనక ప్రభుత్వం ఉందనేది స్పష్టమవుతుంది. అనుబంధ సంస్థ వైఖరి బట్టి కూటమి ప్రభుత్వం విద్యుత్ ఉద్యోగుల సంక్షేమానికి పూర్తి వ్యతిరేకమని మరోసారి బట్టబయలైంది. పలుమార్లు ప్రభుత్వం, ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లినా స్పందించకపోవడం వల్లే దశల వారి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని జేఏసీ నేతలు పునరుద్ఘాటించారు. ప్రభుత్వ అనుబంధ ఉద్యోగ సంఘాలు కార్మిక సంఘాలు ఉద్యమాన్ని పక్కదారి పట్టించేందుకు ఎన్ని ప్రయత్నాలు చేసినా డిమాండ్లు నెరవేరేంతవరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ నెల 14న వర్క్ టు రూల్ పాటిస్తామని ప్రకటించారు.

రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ సంస్థల్లో సుమారు 27 వేల మంది కాంట్రాక్టు కార్మికులు చాల తక్కువ వేతనాలకు పనిచేస్తున్నరనీ వారిని పెర్మనెంట్ చేయాలనీ డిమాండ్ చేస్తుంటే... తెలుగు నాడు విద్యుత్ కార్మిక సంఘం మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరించడం చూస్తే ప్రభుత్వం డిమాండ్లు నెరవేర్చేందుకు నెట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించేటట్లుగా కనిపించడం లేదని సుస్పష్టమౌతోంది. ఎన్నికల సమయాల్లో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక విద్యుత్ కార్మికులను విస్మరించడం తగదని జేఏసీ చెబుతోంది. విద్యుత్ ఉద్యోగులకు 4 డీఏలు పెండింగ్ లో ఉన్నాయి. ఈ డిమాండ్లేవీ పరిష్కరించకుండా ఉద్యమాన్ని నీరుగారిచేందుకు ప్రభుత్వం శాయశక్తుల కుయుక్తులు పన్నుతూ ఆందోళన కార్యక్రమాలను విచ్ఛిన్నం చేసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసినా.. వాటిని తిప్పికొట్టేందుకు జేఏసీ దూకుడుగా వ్యవహరిస్తోంది.



మళ్లీ 'ఆపరేషన్ లంగ్స్'

- రోడ్లపై ఆక్రమణల తొలగింపునకు సన్నద్ధం
- అర్హులైన వీధి వ్యాపారులకు వెండింగ్ జోన్లలో స్థలాలు
- జీవీఎంసీ అదనపు కమిషనర్, చీఫ్ సిటీ ప్లానర్ వెల్లడి

డాబాగార్డెన్స్: దసరా సందర్భంగా ఆపరేషన్ లంగ్స్ కార్యక్రమానికి తాత్కాలికంగా విరామం ఇచ్చినట్లు జీవీఎంసీ అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి, చీఫ్ సిటీ ప్లానర్ ప్రభాకరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని అనేక ప్రాంతాల్లో ఇంకా ఆక్రమణలు కొనసాగుతున్నాయని, దీనిపై ప్రజల నుంచి అనేక ఫిర్యాదులు, వినతులు అందుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ఆక్రమణలను తొలగించేందుకు జీవీఎంసీ తిరిగి ఆపరేషన్ లంగ్స్ చర్యలను కొనసాగించనుందని వెల్లడించారు. నగర ప్రజలు, వాహనచోదకుల రాకపోకలు సాఫీగా సాగేందుకు టౌన్ ప్లానింగ్, యూసీడీ విభాగాలు సంయుక్తంగా కార్యాచరణ చేపట్టాయని వారు వివరించారు. రోడ్లు, ఫుట్‌పాత్‌ల విస్తరణ, ఆక్రమణల తొలగింపు, అర్హులైన వీధి వ్యాపారులను గుర్తించి, వెండింగ్ జోన్ల రూపకల్పన ద్వారా వారికి పునరావాసం కల్పించే దిశగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రోడ్లు, ఫుట్‌పాత్‌లు, జంక్షన్లను ఆక్రమించి ప్రజలు, వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదే సమయంలో అర్హులైన వీధి వ్యాపారులకు నిర్దేశిత వెండింగ్ జోన్లలో వ్యాపారం చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు వివరించారు.

కేంద్ర మంత్రికి స్వాగతం



కేంద్రమంత్రికి స్వాగతం పలుకుతున్న పోర్టు చైర్మన్ అంగముత్తు

మహారాణిపేట: కేంద్ర పోర్టులు,నౌక,జలవనరుల శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్‌కు ఆదివారం విశాఖలో ఘన స్వాగతం లభించింది. ఢిల్లీ నుంచి విమానంలో విశాఖ వచ్చిన మంత్రికి ఎయిర్ పోర్టులో పోర్టు చైర్మన్ అంగముత్తు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అక్కడ నుంచి మంత్రి నోవాటెల్‌కు చేరుకున్నారు.

నేడు 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర' అవార్డుల ప్రదానం

మహారాణిపేట: జిల్లాలో స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఉత్తమంగా నిలిచిన వారికి సోమవారం అవార్డులను ప్రదానం చేయనున్నట్లు కలెక్టర్ హరేందిర ప్రసాద్ తెలిపారు. సోమవారం సాయంత్రం 4 గంటలకు సిరిపురంలోని వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం జరుగుతుంది. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహిస్తారని కలెక్టర్ తెలిపారు.

నూతన ఉపాధ్యాయులకు ఇండక్షన్ శిక్షణ



యోగాసనాలు వేస్తున్న నూతన ఉపాధ్యాయులు

సబ్బవరం : దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో 'మెగా డీఎస్సీ - 2025' ద్వారా నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయుల కోసం ప్రభుత్వం ఇండక్షన్ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన సుమారు 400 మంది సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు ఈ నెల 3 నుంచి 10వ తేదీ వరకు వారం రోజుల పాటు రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణ ఇస్తున్నట్లు అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావు నాయుడు తెలిపారు. శిక్షణలో భాగంగా ఆదివారం ఉపాధ్యాయులకు యోగా, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. శిక్షణ సమర్థవంతంగా జరిగేందుకు పర్యవేక్షక కమిటీలు, వైద్య సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

అప్పన్న సన్నిధిలో నిత్య కల్యాణాల రికార్డు

- స్వామి సేవలో తరించిన తమిళనాడు భక్తులు
- 125 నిత్య కల్యాణాలు, 125 స్వర్ణపుష్పార్చనలు
- 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తరశతనామావళి
- 138 మంది ఉభయదాతల భాగస్వామ్యం



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకులు, తమిళనాడుకు చెందిన కృష్ణన్ స్వామి



నిత్యకల్యాణంలో మాంగల్యధారణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



తమిళనాడుకు చెందిన ఉభయదాతలతో కిక్కిరిసిన కల్యాణ మండపం



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఆదివారం రికార్డు స్థాయిలో నిత్యకల్యాణాలు, స్వర్ణపుష్పార్చన సేవలు వైభవంగా జరిగాయి. చెన్నైకి చెందిన కించిత్కారం ధర్మ సంస్థాపనమ్ ఆధ్వర్యంలో ఏకంగా 125 నిత్యకల్యాణాలు, 125 స్వర్ణ పుష్పార్చనలు నిర్వహించారు. తమిళనాడు నుంచి వచ్చిన ఆ సంస్థకు చెందిన 125 మంది ఉభయదాతలు ఈ సేవల్లో పాల్గొన్నారు. వీరికి అదనంగా మరో 13 మంది ఉభయదాతలు కూడా నిత్యకల్యాణంలో పాల్గొనడంతో.. మొత్తం 138 నిత్య కల్యాణాలు జరిగాయి. ఉభయదాతలతో ఆలయ కల్యాణ మండపం కిక్కిరిసిపోయింది. తొలుత ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉభయదాతలను కల్యాణ మండపంలో కూర్చోబెట్టారు. స్వామి వారి ఉత్సవమూర్తులను శేషతల్పంపై అధిష్టింపజేసి.. 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తరశత నామావళి సేవను శాస్త్రోక్తంగా నిర్వహించారు. విశేషంగా హారతి అందించారు. ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం నిర్వహించారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో ఈ కల్యాణాన్ని శాస్త్రోక్తంగా పూర్తిచేశారు. అలాగే సాయంత్రం గరుడసేవ నిర్వహించారు. స్వామి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని గరుడ వాహనంపై అధిష్టింపజేశారు. సింహగిరి మాడ వీధిలో స్వామికి పెద్ద ఎత్తున తిరువీధి సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమాలను స్థానాచార్యులు టి.పి. రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, కరి సీతారామాచార్యులు, ఇతర అర్చకులు పర్యవేక్షించారు. కించిత్కారం ధర్మ సంస్థాపనమ్ నిర్వాహకులు యు.వి.కృష్ణన్ స్వామి సేవల్లో పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే గిరిజన విద్యార్థులకు అనారోగ్యం

ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్



కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఆశ్రమ పాఠశాల పిల్లలను పరామర్శిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

డాబాగార్డెన్స్: పార్వతీపురం మన్యం జిల్లాలోని కురుపాం మండలం శివన్నపేట గురుకులం ఆశ్రమ పాఠశాలలో 110 మంది విద్యార్థులు అస్వస్థతకు గురై ఆస్పత్రి పాలయ్యారు. మొదట పార్వతీపురం ఏరియా ఆస్పత్రి, గుమ్మలక్ష్మీపురం పీహెచ్‌సీల్లో చికిత్స పొందినప్పటికీ, 37 మంది విద్యార్థినుల పరిస్థితి విషమించడంతో వారిని విశాఖలోని కేజీహెచ్‌కు తరలించారు. ఈ ఘటనను ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్ ప్రభుత్వ వైఫల్యంగా పేర్కొన్నారు. ఆయన విశాఖలో కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థినులను ఆదివారం పరామర్శించారు. పాఠశాలలో మంచినీరు, వాష్‌రూమ్‌లు, వసతి గదులు, డైనింగ్ హాల్ వంటి సరైన సదుపాయాలు లేకపోవడం, అలాగే హెల్త్ చెకప్‌లు నిర్వహించకపోవడం, హెల్త్ అసిస్టెంట్లు లేకపోవడమే ఈ దుర్ఘటనకు, ఇద్దరు విద్యార్థుల మరణానికి, 110 మంది ఆసుపత్రిలో చేరడానికి కారణమని వారు విమర్శించారు. చనిపోయిన విద్యార్థులకు రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, ఆశ్రమ పాఠశాలల్లో హెల్త్ అసిస్టెంట్స్‌ను నియమించాలని, విద్యార్థులకు మంచి వైద్యం అందించాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు.

జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపిక



చెల్లుబోయిన నాగేశ్వరరావు

సీతంపేట: యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కర్నాటక రాష్ట్రం మైసూర్‌లో ఈ నెల 9వ తేదీ నుంచి 12 వరకు జరగనున్న 50వ జాతీయ యోగా పోటీలకు అక్కయ్యపాలేనికి చెందిన చెల్లుబోయిన నాగేశ్వరరావు ఎంపికయ్యారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో కనబరిచిన ప్రతిభ ఆధారంగా జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. నాగేశ్వరరావు జిల్లా మలేరియా కార్యాలయంలో ల్యాబ్ టెక్నీషియన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గతంలో ఆయన విద్యార్థులకు ట్రయథ్లాన్‌లో శిక్షణ ఇచ్చి జాతీయ స్థాయిలో పతకాలు సాధించారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన నాగేశ్వరరావును జిల్లా మలేరియా అధికారులు, సహచర ఉద్యోగులు అభినందించారు.

గిరిజన విద్యార్థులకు మెరుగైన వైద్యం



కేజీహెచ్‌లో అస్వస్థతకు గురైన విద్యార్థినిని పరామర్శిస్తున్న మంత్రి సంధ్యారాణి

మహారాణిపేట: కురుపాం గిరిజన బాలికల పాఠశాలలో అస్వస్థతకు గురై కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థినులను ఆదివారం రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి పరామర్శించారు. పాఠశాలలో మొత్తం 129 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారని, అందులో 37 మందిని కేజీహెచ్‌కు తరలించామని మంత్రి తెలిపారు. బాలికలు జాండీస్, జ్వరంతో బాధపడుతున్నారని, కొందరిలో హెపటైటిస్-ఏ ఉన్నట్లు గుర్తించామన్నారు. ప్రస్తుతం అందరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, మెరుగైన వైద్యం అందుతోందని సంతృప్తి వ్యక్తం చేశారు. హాస్టల్‌లో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేశామని, మెడికల్ టీమ్ పర్యవేక్షణలో ఉందని మంత్రి తెలిపారు. ఈ ఘటనపై విచారణ జరుగుతోందని, ఎవరి తప్పిదం ఉన్నా క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు.

జూలో ఉత్సాహంగా బర్డ్స్ వాచ్



చెట్లపై ఉన్న పక్షులను చూస్తున్న పిల్లలు



సీతాకోక చిలుకలను బైనాక్యులర్ల ద్వారా వీక్షిస్తున్న చిన్నారులు

ఆరిలోవ: ఇందిరా గాంధీ జూ పార్కులో జరుగుతున్న వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా ఆదివారం బర్డ్స్ వాచ్ కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు పాల్గొని, జూలోని చెట్లపై తిరుగుతున్న వివిధ పక్షి జాతులను గుర్తించి, పరిశీలించారు. అలాగే దూరంగా ఎగురుతున్న సీతాకోక చిలుకలను బైనాక్యులర్ల ద్వారా వీక్షించారు. జూ క్యూరేటర్ జి.మంగమ్మ మాట్లాడుతూ పిల్లలకు వన్యప్రాణులపై అవగాహన కల్పించేందుకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. దీనిలో భాగంగా మంగళవారం పాఠశాల, కళాశాలల విద్యార్థులకు ఎలక్యూషన్ పోటీలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. పోటీల్లో పాల్గొనదలచినవారు 9491569344ను సంప్రదించాలని కోరారు.

నేడు కలెక్టరేట్‌లో 'పీజీఆర్‌ఎస్'

మహారాణిపేట: విశాఖ కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు జరిగే ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను అందజేయాలని, గతంలో అర్జీ ఇచ్చినట్లయితే ఆ స్లిప్పును తప్పనిసరిగా తీసుకురావాలని కలెక్టర్ సూచించారు.

నవంబర్ 7న 'ఫ్యాప్టో' మహాధర్నా



మహాధర్నా పోస్టర్ విడుదల చేస్తున్న ఫ్యాప్టో జిల్లా అధ్యక్షుడు బమ్మిడి కేశవరావు

తగరపువలస: ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 7న విజయవాడలో చేపట్టనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఆర్గనైజేషన్ (ఫ్యాప్టో) జిల్లా చైర్మన్ బమ్మిడి కేశవరావు కోరారు. ఆదివారం ఆనందపురంలో మహాధర్నా పోస్టర్‌ను విడుదల చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం వెంటనే పీఆర్సీ కమిటీని వేసి మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే బకాయి ఉన్న డీఏలను వెంటనే చెల్లించాలని కోరారు. ఈ ధర్నాలో జిల్లాలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు మిత్ర సంఘాలతో కలిసి పెద్ద సంఖ్యలో పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

ఆసియా క్రికెట్ చాంపియన్‌షిప్‌నకు విశాఖ విద్యార్థి



మూగు ఈశ్వరరెడ్డి

సింధియా: థాయిలాండ్‌లో జరగనున్న 2వ ఆసియా అంతర్జాతీయ క్రికెట్ చాంపియన్‌షిప్‌నకు భారత టీ10 టెన్నిస్ బాల్ క్రికెట్ జట్టులో 62వ వార్డు దుర్గానగర్‌కు చెందిన బీటెక్ విద్యార్థి మూగు ఈశ్వరరెడ్డి ఎంపికయ్యాడు. చిన్నప్పటి నుంచి క్రీడలపై ఆసక్తి, నిత్యం సాధన చేయడమే తనకు ఈ అవకాశం దక్కడానికి కారణమని ఈశ్వరరెడ్డి తెలిపారు. ఆయన ఎంపిక పట్ల కుటుంబ సభ్యులు, స్నేహితులు, ఆంధ్రప్రదేశ్ టీ10 క్రికెట్ అసోసియేషన్ పీడీ సుకుమార్, రాంబాబు తదితరులు అభినందనలు తెలిపారు.

రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు జాహ్నవి ఎంపిక



పద్మనాభం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న గంట్యాడ జాహ్నవి రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు ఎంపికైంది. గోపాలపట్నం ఇండోర్ స్టేడియంలో శనివారం జరిగిన జిల్లా స్థాయి అండర్-17 జూడో పోటీల్లో ఆమె ప్రతిభ కనబరిచి ఈ అవకాశం దక్కించుకుంది. త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆమె పాల్గోనుంది.

జూ పార్కుకు కొత్త అందాలు



'డక్ ఏవరీ'లో అలరిస్తున్న బాతులు



ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో బాతులు సందర్శకులను అలరిస్తున్నాయి. జూ అధికారులు ఇటీవల ఈ బాతులను ఇతర జూ పార్కుల నుంచి మొదటిసారిగా ఇక్కడికి తీసుకువచ్చారు. ఇంతవరకు ఇక్కడ బాతుల జాతి అందుబాటులో లేదు. వీటి కోసం లవ్ బర్డ్స్ జోన్ పక్కన ప్రత్యేకంగా 'డక్ ఏవరీ' నిర్మించారు. ఈ ఏవరీలో తెలుపు, బూడిద రంగు, నలుపు-నీలం కలిసిన రంగుల్లో ఆకర్షణీయంగా ఉండే బాతులను విడిచిపెట్టారు. కొద్ది రోజులుగా ఈ బాతులు సందర్శకులకు కొత్త అనుభూతిని అందిస్తున్నాయి. ఏవరీ లోపల వాటి కోసం ఏర్పాటు చేసిన చిన్న కొలనులో ఈత కొడుతూ, పచ్చని పచ్చికపై హుషారుగా తిరుగుతూ సందడి చేస్తున్నాయి. యానిమల్ కీపర్లు అందించే గింజలు, పండ్ల ముక్కలను తింటూ ఆకట్టుకుంటున్నాయి.

బీసీఐ ఎన్నికల నిబంధనలు సడలించాలి

వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పాకా



అల్లిపురం: బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(బీసీఐ) ఎన్నికల నిబంధనలను సడలించాలని వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పాకా సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఎన్నికల నియమ నిబంధనల్లో ముఖ్యమైన రూ.1,25,000 నామినేషన్ ఫీజు మధ్య తరగతి న్యాయవాదులకు ఆర్థిక భారమని ఆయన అభిప్రాయపడ్డారు. సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు లేని ఈ నిబంధనలు.. బార్ కౌన్సిల్ ఎన్నికలకు ఎందుకని ప్రశ్నించారు. ఈ నిబంధన వల్ల డబ్బున్న న్యాయవాదులు మాత్రమే పోటీ చేసేందుకు అవకాశం దక్కుతుందని, మధ్య తరగతి న్యాయవాదులకు పోటీ చేసే హక్కు లేదా అని నిలదీశారు. ఇది ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ న్యాయవాదులు పోటీలో లేకుండా చేయాలనే కుట్రపూరితమైన జీవో అని పాకా ఆరోపించారు. ఈ నిబంధనను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. మధ్యతరగతి, ఎస్సీ, ఎస్టీ, బీసీ న్యాయవాదులు ఎన్నికల్లో పోటీ చేసే విధంగా జీవోను సవరించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఉన్న బార్ కౌన్సిల్ సభ్యులు ఈ జీవోపై ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. జిల్లాల బార్ అసోసియేషన్లు, బార్ కౌన్సిల్ సభ్యులు అత్యవసర సమావేశాలు నిర్వహించి,.. ఒక తీర్మానం చేసి, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు పంపాలని కోరారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం జీపీలు, ఏజీపీలు, పీపీలు, ఏపీపీలు, స్పెషల్ పీపీలు నియామకాల్లో అన్ని సామాజిక వర్గాల ప్రాతినిధ్యం ఉండేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నేడు విశాఖకు భారత మహిళా క్రికెట్ జట్టు

విశాఖ స్పోర్ట్స్ : ఐసీసీ మహిళా ప్రపంచ కప్ క్రికెట్ టోర్నీలో పాల్గొనే భారత మహిళా జట్టు కొలంబో నుంచి నేరుగా ప్రత్యేక విమానంలో సోమవారం మధ్యాహ్నం విశాఖ చేరుకోనుంది. విశాఖ వేదికగా మొత్తం ఐదు ప్రపంచకప్ మ్యాచ్‌లు జరగనున్నాయి. భారత జట్టు మంగళవారం వైఎస్సార్ స్టేడియంలో రాత్రి 6 నుంచి 9 గంటల వరకు ఫ్లడ్‌లైట్ల వెలుతురులో ప్రాక్టీస్ చేయనుంది. ప్రపంచ కప్‌లో భాగంగా భారత్ ఈ నెల 9న దక్షిణాఫ్రికాతో, 12న ఆస్ట్రేలియాతో తలపడనుంది. 13వ తేదీన జట్టు ఇండోర్‌కు బయలుదేరుతుంది. దక్షిణాఫ్రికా జట్టు మంగళవారం విశాఖకు చేరుకోనుండగా, ఆస్ట్రేలియా జట్టు 9న రానుంది. విశాఖలో జరిగే మ్యాచ్‌ల్లో (26న జరిగే మ్యాచ్ మినహా) మిగిలినవి మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమై డే-నైట్ మ్యాచ్‌లుగా జరుగుతాయి. ఇంగ్లాండ్-న్యూజిలాండ్ జట్ల మధ్య 26న జరిగే మ్యాచ్ మాత్రం ఉదయం 11 గంటలకు ప్రారంభం కానుంది.

యువకులను రక్షించిన లైఫ్‌గార్డ్స్



యువకుడితో పోలీసులు

ఏయూక్యాంపస్: ఆర్కే బీచ్ సమీపంలో ఆదివారం సాయంత్రం సముద్రంలో మునిగిపోతున్న ఇద్దరు యువకులను పోలీసులు, లైఫ్‌గార్డులు రక్షించారు. మింది ప్రాంతానికి చెందిన ఐదుగురు యువకులు బీచ్‌కు వచ్చి సముద్ర స్నానం చేస్తుండగా.. వారిలో కిలారి సిద్ధు, అకిరి చరణ్ తేజ అలల్లో చిక్కుకున్నారు. వెంటనే స్పందించిన మెరైన్ పోలీసుల సమాచారంతో జీవీఎంసీ లైఫ్‌గార్డులు పోలిరాజు, అచ్చన్న రంగంలోకి దిగారు. యువకులిద్దరినీ రక్షించి ఒడ్డుకు చేర్చారు. సిద్ధు ఆరోగ్యం నిలకడగా ఉండగా.. చరణ్ తేజకు ప్రాథమిక చికిత్స అందించి ఆసుపత్రికి తరలించారు.

సమ్మోహనం.. నృత్యవిన్యాసం



నృత్య కళాకారుల నాట్య విన్యాసం

మద్దిలపాలెం: ప్రముఖ కూచిపూడి నాట్యకారిణి, బంగారు పతక విజేత అరుణ పరమేశ్ స్థాపించిన సంయుక్త మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ 8వ వార్షికోత్సవం ఆదివారం కళాభారతి ఆడిటోరియంలో వైభవంగా జరిగింది. ఈ వేడుకలో 60 మందికి పైగా శిష్యులు కూచిపూడి నృత్య విన్యాసాలతో అద్భుత ప్రదర్శన ఇచ్చి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ గణబాబు మాట్లాడుతూ.. భారతీయ శాస్త్రీయ కళల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఉద్యోగ నియామకాల్లో స్పోర్ట్స్ కోటా తరహాలో.. కల్చరల్ కోటాను ప్రవేశపెట్టే దిశగా ప్రయత్నాలు ప్రారంభించాలనే ఆలోచనను వ్యక్తం చేశారు. కూచిపూడి నాట్య నిపుణురాలు సూదగాని గీతా నారాయణ్ చిన్నారులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా 'బ్రహ్మాంజలి', 'భో శంభో', 'వాలపుల సోలపుల' వంటి నృత్యరూపకాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఐసీసీఆర్ సౌత్ డైరెక్టర్ ప్రదీప్ కుమార్, ఎస్ఎండీఏ ప్రిన్సిపాల్ కె.వి.లక్ష్మి, తేజశ్రీ తదితరులు పాల్గొన్నారు.

నవంబరు 30న విజయవాడలో కాపుల భారీ సభ

కాపునాడు జాతీయ అధ్యక్షుడు గాళ్ల సుబ్రహ్మణ్యం



మాట్లాడుతున్న కాపునాడు జాతీయ అధ్యక్షుడు గాళ్ల సుబ్రహ్మణ్యం

మధురవాడ: కాపుల ఉనికి, శక్తిని చాటే విధంగా నవంబరు 30న విజయవాడలో భారీ సభ నిర్వహిస్తున్నట్లు కాపునాడు జాతీయ అధ్యక్షుడు గాళ్ల సుబ్రహ్మణ్యం తెలిపారు. దివంగత మిరియాల వెంకటరావు నాయకత్వంలో ఏర్పాటైన కాపు ఉద్యమం 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ సభను నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. మధురవాడ ఎన్‌వీపీ లా కాలేజీ ఇందిరా విహార్ ఆడిటోరియంలో ఆదివారం జరిగిన కాపునాడు జోన్-1 శ్రీకాకుళం, విజయనగరం, అరకు, విశాఖపట్నం, అనకాపల్లి పార్లమెంటరీ నియోజకవర్గాల ప్రాంతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. 24 శాతం ఓటింగ్‌కు అనుగుణంగా స్థానిక సంస్థల్లో కాపులకు సీట్లు ఇవ్వాలని, విశాఖలో కాపు భవనం నిర్మాణానికి అవకాశం కల్పించాలని, కాపు కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కాపునాడులో ఏ పార్టీ వారైనా ఉండవచ్చన్నారు. ఇటీవల చంద్రబాబు రాయలసీమలోని గిరిబలిజ పేరుతో ఒక కులాన్ని బీసీలో చేర్చారని, దానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటం చేయడంతో దానిపై స్టేటస్‌కో వచ్చిందన్నారు. విజయవాడ సభకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ని ఆహ్వానిస్తారా అని మీడియా ప్రశ్నించగా.. ఆహ్వానిస్తామని సుబ్రహ్మణ్యం తెలిపారు. అయితే ఆయన వచ్చే అవకాశం లేదన్నారు. కాపు నాయకులు కర్రి వెంకటరమణ, పాండ్రంకి జయరాజు, నీరుకొండ రామచంద్రరావు, శ్యామలాదేవి తదితరులు పాల్గొన్నారు.